
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5 సిద్దిపేట
సోమవారం 24 ఫిబ్రవరి 2025


సిద్దిపేటలోని చేపల మార్కెట్‌లో సందడి

అటు జోరు.. ఇటు బేజారు


ఖాళీగా దర్శనమిస్తున్న చికెన్ సెంటర్

వారంలో రెండు, మూడు సార్లు చికెన్ తినే మాంసాహార ప్రియులు బర్డ్‌ఫ్లూ భయంతో 15 రోజుల నుంచి చికెన్‌కు దూరంగా ఉంటున్నారు. ఇక ఆదివారం వచ్చిందంటే ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే బర్డ్‌ఫ్లూ భయంతో చాలా మంది ఆదివారం మటన్, చేపలను కొనుగోలు చేశారు. కొర్రమీను చేపలు రూ.600కు అమ్ముడుపోగా, మిగతా చేపలు సాధారణ రోజుల కంటే రూ.100 ఎక్కువగా విక్రయించారు. ఇక కొనుగోళ్లు లేక చికెన్ దుకాణాలు వెలవెలబోయాయి.

- సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి)


మటన్ మార్కెట్‌లో

భక్తజనమయం
మల్లన్న ఆలయం

చేర్యాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ వారాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఈసందర్భంగా తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నానమాచరించారు. భక్తిప్రపత్తులతో బోనం నివేదించి పట్నాలు రచించారు. స్వామివారి దర్శనానికి సుమారు 3గంటల పాటు సమయం పట్టడంతో ఇబ్బందులుపడ్డారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదివారం మల్లన్నను దర్శించుకున్నారు.



సంగారెడ్డి పాత బస్టాండ్ సంగమేశ్వర ఆలయంలో
శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి

రంగులు, హోమం పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశం


సంగారెడ్డి పాత బస్టాండ్ సంగమేశ్వర ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 23 : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డిలోని పాతబస్టాండ్ వద్దగల సంగమేశ్వర దేవాలయంలో జరుగుతున్న శివరాత్రి ఏర్పాట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆదివారం నాడు పరిశీలించారు. దేవాలయంలో మరమ్మతులు, రంగులు, హోమం పనులను పరిశీలించిన జగ్గారెడ్డి శివరాత్రి పండుగ వరకు అన్ని పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. జగ్గారెడ్డి వెంట మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ తోపాజీ అనంతకిషన్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కిరణ్‌గౌడ్, మహేష్ ముదిరాజ్, సుధాకర్, గంగేరి శ్రీహరి తదితరులు ఉన్నారు.


సంగారెడ్డి పాత బస్టాండ్ సంగమేశ్వర ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జగ్గారెడ్డి

ఇసుక రవాణాపై
నిఘా

- నిత్యం పోలీసుల తనిఖీలు
- అక్రమంగా రవాణా చేస్తున్న లారీలు, ట్రాక్టర్లు సీజ్
- ఇసుక డంపులపై దాడులు
- గడిచిన ఏడాదిలో 222 కేసులు నమోదు



సిద్దిపేటక్రైం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు నిఘా ఏర్పాటు చేసి ఎక్కడిక్కడ కట్టడి చేస్తున్నారు. ప్రభుత్వం ఇసుక దందాను పూర్తిగా నిర్మూలించాలని ఉత్తర్వులు జారీ చేయడంతో సీపీ అనురాధ ప్రత్యేక దృష్టి సారించారు. ఇసుక వ్యాపారులు కాళేశ్వరం, సిరిసిల్ల, వేములవాడ కరీంనగర్, పెద్దపల్లి వాగుల నుంచి ఇసుకను తీసుకొచ్చి సిద్దిపేటలో డంప్ చేస్తూ జోరుగా దందా సాగిస్తూ ఉంటారు. ఈ క్రమంలో తనిఖీలు ముమ్మరం చేయడంతో వ్యాపారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

నిరంతర తనిఖీలు

సిద్దిపేట జిల్లాలో రాజీవ్ రహదారి బెజ్జంకి నుంచి ములుగు వరకు 98 కిలోమీటర్లు ఉంటుంది. ఈ రహదారిపై రాత్రింబవళ్లు టిప్పర్లు, లారీల్లో నిత్యం హైదరాబాద్‌కు ఇసుక రవాణా చేస్తుంటారు. కొందరు ఇతర జిల్లాల నుంచి పెద్ద పెద్ద లారీల్లో ఇసుకను తీసుకొచ్చి రహస్య ప్రదేశాల్లో డంపు చేస్తూ అధిక ధరలకు టిప్పర్లతో, ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. బెజ్జంకి, అనంతసాగర్ ,కరీంనగర్ ,సిరిసిల్ల, ముస్తాబాద్ వాగుల నుంచి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రవాణా చేస్తున్నారు. మరికొందరు అనుమతికి మించి కూడా ఇసుకను తరలిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తుండడంతో వ్యాపారస్తులు సతమతమవుతున్నారు. ఈనెల 10న బెజ్జంకి పోలీస్‌స్టేషన్ పరిధిలో గాగిల్లాపూర్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక డంప్ చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 40 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ నెల 16న కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో కొండపాక స్టేజి వద్ద వడ్డెర కాలనీలో ముగ్గురు ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక డంపు చేశారు. ఎక్కువ రేటుకు విక్రయిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 116 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. గడిచిన ఏడాదిలో జిల్లావ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణాపై 222 కేసులు నమోదు చేసి 256 మందిని అరెస్టు చేసి, రూ.4,60,000 విలువ చేసే ఇసుకను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 10 కేసులు నమోదు చేసి 12 మందిని అరెస్టు చేశారు. రూ.1,05,000 విలువ గల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు.



కఠిన చర్యలు తప్పవు
- సీపీ అనురాధ



జిల్లా పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలించినా, డంప్ చేసి నా చర్యలు తప్పవు. ఇసుక అక్రమ రవాణా గురించి ప్రజలు డయల్ 100కు, పోలీస్ కంట్రోల్ రూం 8712667100 నంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలి. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాము.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి

- హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం
- రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


హుస్నాబాద్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో పట్టభద్రుల ఆత్మీయసమ్మేళనంలో ఏఐసీసీ కార్యదర్శి రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు పి.విశ్వనాథన్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన వారికి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్ ఇచ్చి గెలిపించే బాధ్యత తనదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపు కోసం కృషి చేసిన వారిని మరిచిపోలేనని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ నరేందర్‌రెడ్డి మెజార్టీ సాధించే విధంగా కష్టపడాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి విధానంతో పనిచేస్తున్నాయని వారి విధానాన్ని తిప్పికొట్టేందుకు ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎంపీ, తెలంగాణ ఎన్నికల పరిశీలకుడు విశ్వనాథన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 42 ఎమ్మెల్సీ నియోజకవర్గాల కంటే హుస్నాబాద్ నియోజకవర్గం భారీ మెజార్టీ సాధించాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, రియాజ్, హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, సైదాపూర్, చిగురుమామిడి, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల పార్టీ అధ్యక్షులు, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు, పలువురు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా
ఇద్దరి ఆత్మహత్య

- ఒంటికి నిప్పంటించుకుని ఘాతుకం

6

పాతాళానికి గంగమ్మ

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- పంటలను కాపాడుకునేందుకు మెట్ట రైతుల భగీరథ యత్నం

7

మెడికల్ హబ్‌గా సిద్దిపేట

- త్వరలోనే అందుబాటులోకి వెయ్యి పడకల ఆసుపత్రి
- సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలా థామస్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ


విమలాథామస్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పలు రంగాల్లో ఆదర్శంగా నిలిచిన సిద్దిపేట, మరోకీర్తిని చాటేలా త్వరలోనే మెడికల్ హబ్‌గా సిద్దిపేట మారనుంది. సిద్దిపేటలో పేద ప్రజలకు కార్పొరేట్ తరహాలో వైద్య సేవలందించాలన్న సంకల్పంతో నిర్మించిన వెయ్యి పడకల ఆసుపత్రిని త్వరలోనే అందుబాటులోకి రానున్నది. దీంతో సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై, ఇతర వాటిపై ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాథామస్ పలు అంశాలను 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

సిద్దిపేటలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఇప్పటి వరకు ఎన్ని బ్యాచ్‌లు పూర్తయ్యాయి?

సిద్దిపేట జిల్లా ఏర్పాటైన తర్వాత 2018లో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి ఆమోదం లభించింది. అదే ఏడాది ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో 150 సీట్లతో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. అనంతరం 2019లో అడ్మిషన్ సీట్లను 175కు పెంచారు. గతేడాది ఒక బ్యాచ్ ఎంబీబీఎస్ కోర్సును పూర్తి చేసుకుంది.ఈ ఏడాది మరొక బ్యాచ్ పూర్తవుతుంది.

మెడికల్ కళాశాలలో ఎన్ని డిపార్‌మెంట్లలో, ఎన్ని పీజీ సీట్లున్నాయి?

సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొత్తం 16 డిపార్‌మెంట్లలో 75 పీజీ సీట్లున్నాయి. వాటిలో వరంగల్ తర్వాత సిద్దిపేట మెడికల్ కళాశాలలోనే 16 కోర్సులున్నాయి. వాటిలో సర్జరీ, ఈఎన్‌టీ, అప్తమాలజీ, సైకియాట్రి, డీవీఎల్, అనస్తీషియా, పీడియాట్రిక్, ఫిజియాలాజీ, బయోకెమిస్ట్రీ, ఫోరెన్సిక్, ఫార్మా, పాథోలాజీ, కమ్యూనిటీ మెడిసిన్, గైనకాలజీ లాంటివి కోర్సులున్నాయి. మరో రెండు రేడియాలాజీ, ఆర్థోపెడిక్ లాంటివి కూడా అందుబాటులో ఉంటాయి. గతంలో 13 డిపార్ట్‌మెంట్లు ఉండగా అవి కాస్త 16 డిపార్ట్‌మెంట్లకు చేరాయి. ఇటీవల ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంటర్న్‌షిప్ కూడా పూర్తిచేసుకున్నారు.

వెయ్యి పడకల ఆసుపత్రి ఎప్పుడు అందుబాటులోకి వస్తుంది?

గత ప్రభుత్వంలో సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా నిబంధనల మేరకు వెయ్యి పడకల ఆసుపత్రిని నిర్మించారు. నిధుల లేమి కారణంగా ఇన్ని రోజులు ఆలస్యమైంది. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే అందుకు సానుకూలంగా స్పందించింది. త్వరలోనే మిగతా నిధులతో వెయ్యిపడకల ఆసుపత్రి అందుబాటులోకి రానున్నది. వెయ్యి పడకల ఆసుపత్రి అందుబాటులోకి వస్తే, పట్టణంలోని 300 పడకల ఆసుపత్రిని మాతాశిశు సంరక్షణ కేంద్రంగా (ఎంసీహెచ్) మారనుంది. దీంతో ఎంసీహెచ్‌లో గైనకాలజీ విభాగంతో పాటు పిడియాట్రిక్ సేవలు అందుతాయి.

ఈ ఏడాది నుంచి పీజీ సీట్ల విషయంలో రాష్ట్ర వాటా కోటా ఎత్తివేయాలని ఎలాంటి ఆంక్షలున్నాయి?

గతంలో ఆయా రాష్ట్రాల్లో వాటా కింద 50 శాతంగా ఉండగా, మిగతా 50 శాతం ఆల్ ఇండియా కోటా కింద అడ్మిషన్ల ప్రక్రియ ఉండేది. తాజాగా వచ్చిన ఉత్తర్వులతో పీజీ సీట్ల విషయంలో మొత్తం ఆల్ ఇండియా కోటా ద్వారానే భర్తీ కానున్నది. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో తెలంగాణ, ఏపీతో పాటు రాజస్థాన్, కేరళ, ఉత్తరప్రదేశ్, నార్త్ ఇండియా రాష్ట్రాలు, మెఘాలయా, అస్సాం, హర్యానా నుంచి వస్తున్నారు.

విద్య, పలు సౌకర్యాలపై కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ హెల్త్ సైన్స్ పరిధిలో సిద్దిపేట ఏ స్థానంలో ఉంది?

సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు యూనివర్సిటీ పరిధిలో సిద్దిపేట టాప్ ర్యాంక్‌లో ఉంది. విద్యతో పాటు విద్యార్థులకు ల్యాబ్, అవసరమైన ప్రాథమిక చికిత్స, సీపీఆర్ తదితరమైన వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

పట్టణంలోని 300 పడకల ఆసుపత్రిలో రోగులు, వారి బంధువులపై ఆసుపత్రి సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి?

రోగులపై, వారి బంధువులపై సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తే ఊరుకునే సమస్యే లేదు. వారెవరైనా సరే రోగులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటాం. రోగుల బంధువులు కూడా సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల సమయంలో రోగులను చూసేందుకు అనుమతించాం. ఆ సమయంలోనే వెళ్లి చూడొచ్చు. అంతేకానీ ఇష్టమొచ్చిన సమయానికి వెళ్తే గర్భిణులకు, సర్జరీ అయిన వారికి ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదముంది. రోగులను చూసేందుకు చిన్నారులను ఆసుపత్రికి ఎట్టి పరిస్థితుల్లో తీసుకురావద్దు. ఈ విషయాన్ని రోగుల బంధువులు కూడా అర్థం చేసుకోవాలి.







చికిత్స పొందుతూ యువకుడి మృతి

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించాడని తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన సిద్దిపేటలో జరిగింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట పట్టణంలోని వడ్డెర కాలనీ చెందిన డీ.మధు (17) కూలీ పని చేస్తుంటాడు. ఈ మధ్యకాలంలో మధు పని చేయకపోవడంతో తన తండ్రి మందలించడంతో మనస్థాపానికి గురై ఈనెల 5వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం మధును హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మధు మృతి చెందాడు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.






అనుమానాస్పదంగా ఇద్దరి ఆత్మహత్య


● ఒంటికి నిప్పంటించుకుని ఘాతుకం


లక్ష్మి (ఫైల్)


శ్రీధర్ (ఫైల్)

కొండపాక, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుని ఓ మహిళ, పురుషుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సిద్దిపేట జిల్లా కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ అందించిన వివరాల ప్రకారం... హైదరాబాద్ నుంచి ఆటోలో ఓ మహిళ, పురుషుడు తిమ్మారెడ్డిపల్లి శివారులోని హోటళ్ల వద్ద శనివారం రాత్రి దిగారు. అనంతరం రోడ్డుకు కొంత దూరంలో పొలాల మధ్యన ఉన్న చెట్ల పొదల్లోకి వెళ్లి వారి వెంట తెచ్చుకున్న కిరోసిన్ ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నారు. ఒక్కసారిగా మంటలు రావడంతో గమనించిన స్థానికులు వాటిని ఆర్పి, పోలీసులకు సమాచారం ఇచ్చి.. అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అప్పటికే మహిళ మృతి చెందింది. పురుషుడిని సిద్దిపేట ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వారి బ్యాగులను పరిశీలించగా వారి ఆధార్ కార్డులు లభ్యమయ్యాయి. సిద్దిపేట సాయి విద్యానగర్ కాలనీకి చెందిన శిరోద్కర్ లక్ష్మి(65), భర్త పేరు చందుగా మహిళ వివరాలు, రంగారెడ్డి జిల్లా మేడిపల్లి ఘట్‌కేసర్ గవర్నమెంట్ స్కూల్ దగ్గర ఆదర్శ నగర్‌కు చెందిన టెక్లేకర్ శ్రీధర్(44), తండ్రి నర్సోజీగా పురుషుడి వివరాలు ఉన్నాయి. వీరిని గుర్తుపట్టిన వారు తొగుట సీఐ లతీఫ్ ఫోన్ నంబరు 8712667342, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ ఫోన్ నెంబరు 8712667345లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.







పెళ్లింట విషాదం

కొడుకు వివాహంలో మైలపోలు తీసి.. కుప్పకూలిన తండ్రి

తండ్రి మరణంతో ఆగిన వివాహం


సత్యనారాయణ గౌడ్ (ఫైల్)

దుబ్బాక, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కొడుకు వివాహంలో మైలపోలు తీసిన తండ్రి ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందాడు. ఈఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రామక్కపేట గ్రామానికి చెందిన సత్యనారాయణగౌడ్, జయ దంపతుల పెద్దకుమారుడు శ్రీనివాస్‌కు రాజన్నసిరిసిల్ల జిల్లా గంబీర్‌రావుపేట మండలం కొత్తపల్లికి చెందిన నాగపూరి మహేష్‌గౌడ్, జ్యోతి దంపతుల ఏకైక కూతురు భావనతో వివాహం నిశ్చయమైంది, ఆదివారం ఉదయం దుబ్బాకలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వివాహం జరపాలని ఏర్పాట్లు చేశారు. సిద్దిపేటలో నివాసం ఉంటున్న సత్యనారాయణ గౌడ్, తన కుమారుడి వివాహానికి అన్ని ఏర్పాట్లు చేశారు. కుమారుడిని శనివారం రాత్రి పెళ్లి కుమారుడిని చేసి, మైలపోల్ తీసి, దుబ్బాకకు పెళ్లింటికి పంపాలనుకున్నారు. అయితే మైలపోల్ తీసిన అనంతరం సత్యనారాయణగౌడ్ ఇంటిలోనే పందిరిలో ఒక్కసారిగా కుప్పకూలాడు. ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆయన మరణించినట్లుగా వైద్యులు తెలిపారు. దీంతో కుమారుడి వివాహం నిలిచిపోవడంతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. అందరితో కలుపుగోలుగా ఉండే అతడు పదవీవిరమణ కూడా పొందారు. ఆయన మృతి పట్ల ఆర్టీసీ కార్మిక సంఘాలు సంతాపం తెలిపాయి.






ఎలాన్ జోష్

హోరెత్తిన ఐఐటీహెచ్ ప్రాంగణం


ఫెస్ట్‌లో విద్యార్థుల ప్రదర్శన


ఎలాన్ ఎన్‌విజన్ ఫెస్ట్‌లో యువత కేరింతలు


ఫేస్ పెయింటింగ్ పోటీలో విద్యార్థులు


ర్యాంప్‌వాక్ చేస్తున్న విద్యార్థి

బ్రేక్ ఫ్రీ డాన్స్ పోటీలో విద్యార్థిని

కంది, ఫిబ్రవరి 23 : ఎథికల్ హ్యాకింగ్ అండ్ సైబర్ క్రైం, డీప్ లెర్నింగ్ వంటి సాంకేతిక వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు.. షుగర్ రాకెట్రీ, డ్రోన్ ఛాలెంజ్ వంటి వింతైన పోటీలు.. వాటర్ గేమింగ్, రోబోటిక్స్, మూవీ మేకింగ్, ఎలక్ట్రిక్, ఆర్ట్ ఎగ్జిబిషన్.... రేడియో ఈవెంట్స్ హంట్, ర్యాంప్ వాక్, బాటిల్ ఆఫ్ బాండ్స్ వంటి షోలతో ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణం హోరెత్తింది. నృత్యాంజలి, క్లాసికల్ పెర్ఫామెన్స్, సంగీత కచేరీలతో మొదలై.. సంస్కృతి, సాంకేతికల ఆవిష్కరణలతో పాటు రాక్‌బ్యాండ్, మ్యూజిక్ స్టేజ్‌లు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. దేశ నలుమూలల నుంచి వివిధ ఇంజనీరింగ్ కళాశాల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు జరిగిన ఎలాన్-ఎన్‌విజన్ వేడుకలు ఆదివారంతో ముగిశాయి. సాంస్కృతిక, సాంకేతికతో కూడిన ఈవెంట్లు అందరినీ అలరించాయి. విజేతలు రూ.6 లక్షల విలువైన బహుమతులు గెలుచుకున్నారు. చివరి రోజు స్వస్తిక్ బ్యాండ్ ప్రదర్శన, ఐఐటీహెచ్ విద్యార్థుల మ్యూజిక్‌తో యువతలో జోష్ నెలకొన్నది. రేడియోమిర్చి సింగర్ అమృత సందడి చేశారు. ఎలాన్, ఎన్‌విజన్ విజయవంతానికి విద్యార్థి కమిటీలు బాధ్యతాయుతంగా పనిచేశాయని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా కొత్తగా వస్తున్న సాంకేతిక మార్పులపై దృష్టి కేంద్రీకరించి మేధస్సును పెంపొందించుకుంటూ కొత్త ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలన్నారు. రేడియోమిర్చి సింగర్ అమృత మాట్లాడుతూ ఐఐటీ హైదరాబాద్‌లో చదువుకోవాలని ఆశగా ఉండేదని, కానీ తనకు అదృష్టం దక్కలేదన్నారు. విద్యార్థులు ప్రపంచస్థాయిలో సాంకేతిక పరిశోధనలు జరిపి దేశ పురోగతికి బాటలు వేయాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

దూసుకెళ్లిన ఈ-బగ్గీలు

ఉత్కంఠభరితంగా రేసింగ్


మహిళ విభాగంలో మొదటి బహుమతిని అందుకున్న భీమవరం విష్ణు మహిళ కాలేజీ జట్టు

నర్సాపూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాళ్లురప్పలు, ఎత్తైన దారి, కంకర, బురద, నీళ్ల మార్గంలో ఈ - బగ్గీలు రయ్‌మంటూ దూసుకెళ్లాయి. నాలుగు గంటల పాటు తాము రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలను నడిపి విద్యార్థులు సత్తా చాటారు. మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీలో 'ఈ-బాజా సే ఇండియా' పేరిట మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయస్థాయి స్థాయి ఎలక్ట్రిక్ వాహనాల రేస్ ఆదివారంతో ముగిసింది. రెండు రోజుల పాటు 19 రాష్ట్రాల నుంచి వచ్చిన 77 జట్లు రూపొందించిన ఈ-బగ్గీలకు వివిధ సాంకేతిక, ట్రయల్ రన్ టెస్ట్‌లను నిర్వహించగా, 51 జట్లు చివరి దశకు చేరుకున్నాయి. అందులో చివరగా 44 టీంలు ఆదివారం నిర్వహించిన ఫైనల్ రేసులో నిలిచాయి. విద్యార్థులు తయారు చేసిన ఎలక్ట్రిక్ వాహనం అన్ని రోడ్లను తట్టుకునేలా ఉందా అని పరీక్షించేందుకు బీవీఆర్ఐటీ కాలేజీ సమీపంలోని చెరువు వద్ద కఠినతరమైన ట్రాక్‌ను నాల్గు కిలోమీటర్ల మేర ప్రత్యేకంగా రూపొందించారు. స్పెషల్ ట్రాక్‌పై ఈ-బగ్గీల ఫైనల్ రేసింగ్ నాలుగు గంటల పాటు ఉత్కంఠభరితంగా కొనసాగింది. విజయవంతంగా నడిపిన విద్యార్థుల జట్టు ట్రోఫీని గెలుచుకున్నాయి. మహిళ విభాగంలో భీమవరం విష్ణు మహిళ కాలేజీ మొదటి బహుమతిని గెలుచుకున్నది. అన్ని విభాగాలలో అక్రుడికి చెందిన పాటిల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ బృందం విజేతగా నిలిచింది. ఈ రెండు టీంలకు రూ.లక్ష ప్రోత్సాహక బహుమతి, ట్రోఫీని అందజేశారు. రెండో బహుమతి పూణెకు చెందిన ఎంఐటీ యూనివర్సిటీకి దక్కగా, రూ.75వేలు, మూడో బహుమతి పింపిరికి చెందిన చించ్‌వడ్ ఇంజనీరింగ్ కాలేజీ గెలుచుకోగా రూ.50 వేల నగదు అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ వి.బాలకిష్టారెడ్డి, గౌరవ అతిథిగా హాజరైన బీపీసీఎల్ సుఖ్‌మాల్‌జైన్ అందజేశారు.


కఠినమైన ఎత్తైన ఉన్న ట్రాక్‌పై ఈ-బగ్గీతో దూసుకెళుతున్న విద్యార్థి

'కేతకీ'కి బ్రహ్మోత్సవ శోభ

సంగమేశ్వర ఆలయంలో ఉత్సవాలు ప్రారంభం

మార్చి 3 వరకు కొనసాగనున్న జాతర

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు



ఝరాసంగం, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీకేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ఆదివారం శిఖర పూజతో వైభవంగా ప్రారంభమయ్యాయి. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు తెలంగాణ ప్రాంతంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణలో స్నానపు గదులు, మరుగుదొడ్ల, తాగునీటి వసతులు, పరిసరాల పరిశుభ్రత, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, స్థానికి ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించనున్నారు.

పూజ కార్యక్రమాలు

24న స్వామి వారికి రుద్రాభిషేకం, రాత్రి పల్లకీ సేవ, 25న సాయంత్రం శేష వాహన సేవ, రాత్రి పల్లకీ సేవ, 26న మహాశివరాత్రి పర్వదినాన లింగోద్భవ సమయన మహన్యస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, 27న నందివాహనసేవ, అగ్నిగుండం, 28న పార్వతీ పరమేశ్వర్ల కల్యాణం, రాత్రి విమానరథోత్సం, మార్చి1న పల్లకీ సేవ, అమ్మవారికీ కుంకుమార్చన, 2న పల్లకీ సేవ, 3న లక్ష బిల్వార్చన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

జహీరాబాద్ నుంచి ఆర్టీసీ స్పెషల్ బస్సులు

జహీరాబాద్ పట్టణానికి 16 కిలోమీటర్ల దూరంలో కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయం ఉంది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్టాడ్ నుంచి జహీరాబాద్‌కు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి. జహీరాబాద్ నుంచి ఆర్టీసీ అధికారులు ఝరాసంగంకు జాతర స్పెషల్ బస్సులను నడుపుతారు. అందులో నేరుగా శ్రీకేతకీ సంగమేశ్వర ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకోవచ్చు.

ఘనంగా శిఖర పూజ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీకేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో శిఖర పూజను ఆలయ అర్చకులు వేదా మంత్రోచ్చారణల మధ్య ఘనంగా చేపట్టారు. మొదట ఆలయానికి సమీపంలోని పుట్టకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజారోహణ కార్యక్రమంతో పాటు స్వామి వారికి అభిషేక కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శివరుద్రప్ప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుమంత్‌రావు పాటిల్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.


శిఖర పూజ నిర్వహిస్తున్న అర్చకులు



వనదుర్గమ్మ.. వస్తున్నాం


ఏర్పాటు చేసిన స్వాగత తోరణం

శివరాత్రి నుంచి ఏడుపాయల మహాజాతర



తూతూమంత్రంగా ఏర్పాట్లు.. పాత వాటికే పూతలు

తాత్కాలిక పనులతోనే సరి

జాతర నిర్వహణకు విడుదల కాని నిధులు

పాపన్నపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : జానపదుల సంస్కృతికి అద్దం పట్టే ఏడుపాయల మహాజాతర రెండు రోజుల్లో ప్రారంభం కానున్నది. రాష్ట్రంలో సమ్మక్క సారలమ్మ జాతర తర్వాత రెండో అతిపెద్ద పండుగగా ప్రసిద్ధిగాంచిన ఏడుపాయల వనదుర్గమ్మ జాతరకు పేరుంది. సుమారు పది లక్షల మంది వస్తారని అంచనా. ప్రతి ఏటా మహాశివరాత్రి నాటి నుంచి ఏడుపాయల వనదుర్గమ్మ సన్నిధిలో మూడు రోజులపాటు జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈ జాతరకు ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు హైదరాబాద్ నగరవాసులు, పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తండోపతండాలుగా తరలి రానున్నారు. ఆలయంలో మూడు రోజుల పాటు విశేష పూజ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. శివరాత్రి పర్వదినాన ఉపవాస దీక్షలు, జాగరణ, తర్వాతి రోజు బండ్ల ఊరేగింపు, చివరి రోజున రథోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మూడు రోజులే కాకుండా వారం పాటు భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటుంటారు.

మారని ఆలయ రూపురేఖలు

పాలకులు మారినా దేవాలయాల రూపురేఖలు మాత్రం మారడం లేదు. ప్రతి ఏటా సుమారు భక్తుల మొక్కుల రూపంలోనే రూ.10 కోట్ల మేరా ఆదాయం సమకూరుతున్నది. టెండర్ల ద్వారా ఆదాయం కోట్లల్లోనే వస్తున్నది. కానీ ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం కనీస సౌకర్యాలు కల్పించక పోగా ప్రత్యేక నిధులను దుర్వినియోగం చేస్తున్నారు. క్షేత్రంలో ఏళ్లుగా మొక్కుల రూపేణ భక్తులు కట్టించిన సుమారు 60 విడిది గృహాలే తప్ప దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా ఒక్కటీ లేదు. భక్తులు నిర్మించిన విడిది గృహాలతోనూ అద్దె రూపంలో ప్రతీ నెల లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. అయిన వాటి నిర్వహణ మాత్రం అంతంత మాత్రమే.

పాత వాటికే పూతలు

జాతర ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. భక్తుల కోసం శాశ్వత పనులు చేపట్టాల్సిన అధికారులు 2016లో ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లకు రంగులు వేశారు. స్నానాల వద్ద కట్టెలను కట్టి, ఆలయం చుట్టూ ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేసి నామమాత్రపు పనులతో చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. ఏడుపాయలకు ఘనమైన చరిత్ర ఉన్నప్పటికీ, ఎన్నేళ్లు గడిచినా భక్తుల సౌకర్యార్థం శాశ్వత పనులను చేపట్టడంలో మాత్రం విఫలమౌతున్నారు. పనుల పేర లక్షల్లో బిల్లులు సమర్పించి ఉన్నకాడికి దండుకుంటున్నారన్న అపవాదులు ఉన్నాయి. శాశ్వత పనులు చేపట్టకపోవడంతో భక్తులకు ఇక్కట్లు తప్పడం లేవన్న విమర్శలు ఉన్నాయి. ప్రతీ ఏటా జాతర ఉత్సవాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తూ ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. గతంలో జాతర కన్న నెల రోజుల ముందే ప్రత్యేక నిధులు మంజూరు చేసేవారు. కానీ, ఈసారి పాలకుల నిర్లక్ష్యమా.. అధికారుల వైఫల్యమా జాతర నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వం పాలకమండలిని ఏర్పాటు చేయకపోవడం ఈ నిర్లక్ష్యానికి ప్రధాన కారణం. అయితే, ఉత్సవ కమిటీ ఊసు కూడా ఎత్తడం లేదు. అనుభవలేమితో ఈవో చంద్రశేఖర్ ఇష్టారీతిన ఏర్పాట్లను చేయిస్తున్నారు. సిబ్బంది కల్పించుకొని చెప్పిన వినడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే నేటివరకు ఏడుపాయల ఏర్పాట్లను పర్యవేక్షించక పోవడం విస్మయానికి గురి చేస్తుంది. ఈవో, ఎమ్మెల్యే మధ్య సయోధ్య కుదరకనే నిధులు మంజూరుకు ఆలస్యం అవుతున్నదని భక్తులు మండిపడుతున్నారు.


తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మూత్రశాలలు

పాతాళానికి గంగమ్మ


రామవరంలో ఎండిన వరి పంట

జనగామలో బావిలో అడుగంటిన నీరు

అడుగంటుతున్న భూగర్భ జలాలు

పంటలను కాపాడుకునేందుకు మెట్ట రైతుల భగీరథ యత్నం

బావుల్లో పూడికతీతలు.. బోర్లు వేయిస్తున్న వైనం

15 రోజుల్లోనే వందలాది బోర్లు వేసిన రైతులు


అక్కన్నపేట మండలం జనగామలో బావిలో క్రేన్‌తో తీస్తున్న పూడిక

హుస్నాబాద్/అక్కన్నపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పొంగిన జలధారలతో ఇక వ్యవసాయానికి ఢోకా లేదని భూమినంతా సాగు చేశారు. కానీ వారి ఆశలు అడియాసలవుతున్నాయి. భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతుండటంతో బావులు, బోర్లు అడుగంటుతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు మెట్ట రైతులు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. దీని కోసం బోర్లు వేస్తున్నారు. బావుల్లో పూడికతీయిస్తున్నారు.

పంటను కాపాడుకునే ప్రయత్నం

హుస్నాబాద్ డివిజన్‌లో గతం కంటే ఎక్కువ వరి సాగు చేశారు. 15 రోజుల నుంచి భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోతున్నాయి. దీంతో పంటలు ఎండి పోయే దశకు వస్తున్నాయి. గత్యంతరం లేక ఒకటీ, రెండు మడులకు నీరు పెట్టడం ఆపి మిగతా మడులకు పారిస్తున్నారు. అయితే, కొందరు రైతులు ఉన్న పంటలను కాపాడుకోవడానికి బోర్లు వేస్తున్నారు. ఆరు నుంచి ఏడు వందల ఫీట్ల లోతు వరకు బోర్లు వేస్తున్నారు. 15 రోజుల వ్యవధిలోనే నీరు రాక రెండు నుంచి మూడు వరకు బోర్లు వేసిన రైతులు ఉన్నారు. ఓ రైతు బోరు వేస్తే సక్సెస్ కాగానే దాని పక్క మరో రైతు వేస్తున్నాడు. ఒక బోర్‌లో నీళ్ల రాకున్నా.. రెండో దానిలో రాకపోతాయా.. అనే ఆశతో కొందరు రైతులు బోర్లు వేస్తూ ఉన్నారు. అడుగంటిన వ్యవసాయబావులను వేల రూపాయలు వెచ్చించి క్రేన్లతో పూడిక తీయిస్తున్నారు. ఒక బావి పూడిక తీయడానికి రూ.25వేలు గంపగుత్తగా తీసుకుంటున్నారు. అక్కన్నపేట మండలం జనగామ గ్రామానికి చెందిన బోనాల శ్రీనివాస్ అనే రైతు తనకున్న మూడు ఎకరాల మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు 10 రోజుల క్రితం ఒకటే రోజు మూడు బోర్లు వేసిన ఫలితం లేకుండా పోయింది. ఇదే గ్రామానికి చెందిన మోటే రాజయ్య మొన్నటి వరకు కొత్తగా తవ్వినా బావి ఉన్న రెండు ఎకరాల వరి పంటకు నీరందించింది. ప్రస్తుతం ఎండిపోతుండంతో క్రేను పెట్టి పూడిక తీయిస్తున్నాడు. ఇలా డివిజన్‌లోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట్, బెజ్జంకి మండలాల్లో 15 రోజుల వ్యవధిలో క్రేన్లు, బోర్లు జోరుగా నడుస్తున్నాయి.


అక్కన్నపేట మండలం మల్లంపల్లిలో వేస్తున్న బోరు


అక్కన్నపేట మండలం రామవరంలో బోరు వేసిన పడని చుక్క నీరు

సిండికేటుగా మారిన బోర్‌వెల్ ఏజెంట్లు

బోర్లు వేయడానికి రైతన్నలు ఆసక్తి కనబరుస్తుండడంతో బోర్‌వెల్ ఏజెంట్లు సిండికేటుగా మారి అధిక ధరలు పెంచి రైతులను దోపిడీ చేస్తున్నారు. 100 ఫీట్ల వరకు ఫీటుకు రూ.85 - 95, 100 ఫీట్ల నుంచి 200 ఫీట్ల వరకు రూ. 110 - 120 ఇలా ఫీట్ల లోతు పెరిగే కొద్దీ ధరలు పెంచుతున్నారు. కేసింగ్, జాలి కేసింగ్ పైపు వేయాలని ఫీటుకు రూ.400 నుంచి రూ.600 వరకు వసూలు చేస్తున్నారు. ఇవే కాక అదనంగా కూడా రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ముక్కు పిండీ వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 500 నుంచి 600 ఫీట్ల వరకు బోరు వేయాలంటే రూ.1.20 లక్షల వరకు ఖర్చు వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు నెలల్లో ఆరు బోర్లు వేసిన

నాకు ఎనిమిది ఎకరాల వరకు భూమి ఉంది. ఏడు ఎకరాల్లో మామిడి తోట, ఒక ఎకరంలో వరి పంట వేసిన గతేడాది మూడు బోర్లు వేశాను. ఈ బోర్లు డిసెంబరు నుంచే ఎత్తిపోయాయి. దీంతో తోటను, వరిని కాపాడుకునేందుకు డిసెంబరు 9వ తేదీ నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు ఆరు బోర్లు వేసిన. అందులో రెండు బోర్లలో చిన్నగా నీటి ధార వస్తుంది. మిగతా నాలుగు బోర్ల నుంచి చుక్క నీరు రాలేదు. వచ్చే నీటితో తోటను కాపాడు కుంటున్నా. వరి ఎండిపోయింది. బోర్ల కోసం రూ.9 లక్షల వరకు ఖర్చు పెట్టిన.

- కంకనాల సదాశివరెడ్డి, జనగామ, అక్కన్నపేట మండలం

చుక్క నీరు పడలే

ఈ పది రోజుల్లో నాలుగు బోర్లు వేశాను. చుక్క నీరు పడలే. బోర్లు వేసేందుకు రూ.2 లక్షలు ఖర్చు చేశాను. పంటలు సాగు చేయడానికి మరో రూ.లక్ష అప్పు చేశాను. సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయి. చేసిన అప్పులు ఎలా తీర్చాలో అని ఆలోచిస్తే భయమేస్తుంది.

- పొన్న కరుణాకర్, రామవరం, అక్కన్నపేట మండలం

నిరుపయోగంగా బర్రెల షెడ్లు

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- వినియోగంలోకి తీసుకురావాలని ప్రజల విజ్ఞప్తి

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బర్రెలకు కూడా ఒక హాస్టల్ ఉండాలని, రైతులకు ఒకే చోట అన్ని సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం సిద్దిపేట నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 8 బర్రెల షెడ్లను నిర్మించింది. రూరల్ మండలం, నారాయణరావుపేట మండలానికి సంబంధించి మూడు షెడ్ల నిర్మాణం పూర్తికాగా, గుర్రాల గొంది గ్రామంలో షెడ్డు మాత్రం నిర్మాణ దశలో ఉన్నది. నంగునూరు మండలంలో రెండు షెడ్లు పూర్తిగా నిర్మాణమయ్యాయి. అర్బన్ మండలం పొన్నాలలో షెడ్డు నిర్మాణం పూర్తికాగా, మిట్టపల్లిలో మాత్రం అసంపూర్తిగానే మిగిలిపోయింది. ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన బర్రెల షెడ్లను సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో మొట్టమొదటిగా పూర్తి చేసి రాష్ట్రానికి మోడల్‌గా చెబుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. మొదట్లో రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచే కాకుండా చుట్టుపక్కల ఉన్న కొన్ని రాష్ట్రాల నుంచి కూడా రైతులు, నాయకులు వచ్చి హాస్టల్‌ను సందర్శించి వెళ్లారు. కానీ ఇది మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. కొద్దికాలంలోనే అన్ని షెడ్లు నిరుపయోగంగానే మారిపోవడం మొదలుపెట్టాయి. అంతేకాకుండా కొనిన షెడ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. మిట్టపల్లిలో అసంపూర్తిగా మిగిలిపోయిన షెడ్డులో జూదం ఆడటం, మద్యం సేవించడం, ఇతర కార్యకలాపాలకు చోటుగా మిగిలిపోయింది.

ఒక్కోదానికి సుమారు 2.5 కోట్లు..

జిల్లాలో నిర్మించిన ఎనిమిది షెడ్డులకు సంబంధించి ఒక్కో దానికి సుమారుగా రూ.2.5 కోట్లు నిధులను కేటాయించి నిర్మాణాలు చేపట్టారు. అంటే ఎనిమిదింటికి కలిపి సుమారు రూ.20 కోట్లు ఖర్చు పెట్టారు. ఇన్ని కోట్లతో నిర్మించిన అవి నిరుపయోగంగానే ఉండడంపై పలువురు రైతులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు ఈ నిధులు వేరే వాటికి కేటాయించినా గ్రామాలు అభివృద్ధి చెందేవని అంటున్నారు. షెడ్డుల వద్ద సీసీ కెమెరాలు, అక్కడ గదులలో ఏర్పాటుచేసిన ఫ్రిజ్ ఇతర వస్తువులు కూడా నిరుపయోగంగానే ఉండిపోయాయి.



నిరుపయోగంగా ఉన్న బర్రెల షెడ్డు



మిట్టపల్లి సమీపంలోని బర్రెల షెడ్డు దుస్థితి

అన్ని ఒకేచోట ఉండేలా నిర్మాణం

బర్రెలకు హాస్టల్ షెడ్లు నిర్మించి వాటికి ఉండే అవసరాలు అన్నింటిని ఒకే చోట ఉండేలా అప్పుడు అధికారులు చర్యలు చేపట్టారు. పశువులకు తొట్టిల నిర్మాణం, నీళ్ల అందుబాటులో ఉండడానికి బోర్లు, వాటి పర్యవేక్షణకు సీసీ కెమెరాలు, రైతులు అక్కడే ఉండి పర్యవేక్షించేలా వారికి గదులను ఏర్పాటు చేశారు. అదేవిధంగా పశువుల డాక్టర్ గదిని కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడి పాలు తీసుకు వెళ్లడానికి ప్రైవేట్ పాల కంపెనీలతో కూడా అప్పట్లో కొన్ని ఒప్పందాలు జరిగాయి. ఇవన్నీ కొద్ది కాలమే ఉండి ఆ తర్వాత అన్ని నిరుపయోగంగానే మిగిలిపోయాయి.

అందుబాటులోకి తీసుకురావాలి

నిర్మాణం చేపట్టిన కొత్తలో ఎప్పటికప్పుడు వాటిని పర్యవేక్షించిన అధికారులు నేడు అటువైపే చూడడం మానేశారు. కోట్ల వ్యయంతో నిర్మించి ప్రభుత్వ ఆధీనంలో ఉండే వాటిని కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు తమ సొంత అవసరాలకు కూడా వాడుకుంటున్నారనే వాదనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బర్రెల షెడ్లపై దృష్టి సారించి ఉపయోగంలోకి తేవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండాల కార్యక్రమం



అగ్నిగుండాలను దాటుతున్న భక్తులు

ధూళిమిట్ట, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెక్కల్ గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆదివారం అగ్నిగుండాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు శివనామస్మరణతో అగ్నిగుండాలను దాటి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చొప్పరి మల్లేషం, పాలకవర్గ సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కొండపోచమ్మకు తలసాని పూజలు



కొండపోచమ్మను దర్శించుకుంటున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌యాదవ్

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ నర్సాపూర్ సమీపంలోని కొండపోచమ్మ అమ్మవారిని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదివారం కుటుంబంతో కలిసి దర్శించుకున్నారు. అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

పరిశ్రమ ఎదుట ఆందోళన



ఆందోళన చేస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

బెజ్జంకి, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమ రసాయన వ్యర్థ జలాలతో మోతుకుల కుంటలో చేపలు మృతి చెందాయని ముదిరాజ్ సంఘం సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు మండలంలోని గాగిల్లాపూర్ శివారులోని మైత్రి సాల్వెంట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎదుట వారు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు అక్కరవేణి పోచయ్య మాట్లాడుతూ ఈ పరిశ్రమల వ్యర్థ జలాలను సమీపంలోని మోతుకుల కుంటలోకి వదులుతున్నారన్నారు. ఇందులో సుమారు రూ.5 లక్షల విలువ గల చేపలను పెంచుతున్నామని, ఆదివారం చేపలు పట్టేందుకు వెళ్లగా మృతి చెంది కనిపించాయన్నారు. సదరు కంపెనీ యాజమాన్యం వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో గాగిల్లాపూర్, గుగిళ్ల గ్రామాల ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

● డీఈవో శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

నంగునూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని జిల్లా విద్యా శాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి నంగునూరు మండలం నర్మెట హైస్కూల్ 70వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య బోధన అందుతుందని తెలిపారు. ఇక్కడ పాఠశాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధుల కోసం ఎదురు చూడకుండా స్థానిక ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో దేశిరెడ్డి ప్రత్యేక చొరవతో కార్పొరేట్ స్థాయి పాఠశాలగా మార్చేందుకు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కేవలం ప్రైవేట్ పాఠశాలలకే పరిమితమైన వార్షికోత్సవాలు నేడు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నంగునూరు ఎంఈవో దేశిరెడ్డి, చిన్నకోడూరు ఎంఈవో యాదిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా అశోక్‌కుమార్‌ను గెలిపించాలి

● ఎమ్మెల్సీ కోదండరాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

సిద్దిపేట కలెక్టరేట్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమం నుంచి వచ్చిన వ్యక్తి, ఉపాధ్యాయుల సమస్యలు తెలిసిన అశోక్‌కుమార్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మెల్సీ కోదండరాం మీడియా సమావేశం నిర్వహించారు. నిబద్ధతతో ఉపాధ్యాయ సమస్యలపై పోరాడే వ్యక్తి అశోక్ కుమార్ అన్నారు. సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి తిరుపతియాదవ్, నాయకులు రామచంద్రం, రాములు, కొండల్ రెడ్డి, ఎల్లయ్య, డీటీఎఫ్ నేత శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగ ప్రదర్శన

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలోని బ్రహ్మ కుమారీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 26 వరకు మహాశివరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన, పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అందరితో కలిసిమెలిసి ఉండాలన్నారు. అనంతరం సిద్దిపేట శాఖ నిర్వాహకులు బికె భవాని మాట్లాడుతూ దుఃఖపూరిత ప్రపంచాన్ని తిరిగి సుఖమయ ప్రపంచంగా మార్చుకోవడానికి నిరంతరం శివపరమాత్ముడి ధ్యానంలో ఉండాలన్నారు.

పగలే వెన్నెల



అల్వాలలో పట్టపగలే వెలుగుతున్న వీధిదీపాలు

మిరుదొడ్డి, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్వాల్ గ్రామంలో పగలు, రాత్రి అనే తేడాలేకుండా విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, దీంతో విద్యుత్ వృథా అవుతున్నదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పగలు విద్యుత్ దీపాలు వెలుగకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రూ.1,00,116 విరాళం

చేర్యాల : కొమురవెల్లి మల్లన్న ఆలయ పరిధిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి జగిత్యాల జిల్లాకు చెందిన వల్లెం మల్లేశ్ రూ.1,00,116నగదు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రామాంజనేయులు సమక్షంలో నగదు అందించారు. ఆయనకు స్వామివారి ప్రసాదం, రశీదు అందజేశారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఎన్నిక

సిద్దిపేట కలెక్టరేట్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఎఫ్‌ఐ సిద్దిపేట జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన జిల్లా ఆరవ మహాసభలకు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరై నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా బత్తుల అభిషేక్ భాను, ఆముదాల రంజిత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా భరత్‌కుమార్, ప్రవీణ్, కార్యదర్శులుగా అర్చన, రాహుల్, సంతోష్ ఎన్నికయ్యారు.

క్రైం కార్నర్

బ్యాంకులో అగ్నిప్రమాదం

గజ్వేల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. తూప్రాన్ రోడ్డులోని బ్రాంచ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల వారు గమనించి బ్యాంకు సిబ్బందితో పాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. కాగా బ్యాంకులోని ఫర్నిచర్, ఫైల్స్ దగ్ధమయ్యాయి. బ్యాంకు సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు.

టీచర్‌కు రిమాండ్

కొండపాక, ఫిబ్రవరి 23 : టీచర్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండపాక మండలం ఖమ్మంపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం పోక్సో కింద కేసు నమోదైంది. ఈ మేరకు టీచర్ దేవయ్యను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్టు తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

చేర్యాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న ఆలయ జాతర సందర్భంగా ఆదివారం వచ్చి ఆలయ పరిసరాలలో తప్పిపోయిన బోయిని కార్తీక్‌ను పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు.

బైక్ డివైడర్‌ను ఢీకొని ఇద్దరు వలస కూలీలు మృతి

చిన్నకోడూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : బైక్ డివైడర్‌ను ఢీ కొట్టడంతో ఇద్దరు వలస కూలీలు మృతి చెందిన సంఘటన చిన్నకోడూరు మండలం మల్లారం శివారులో రాజీవ్‌రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన ఉలేష్ కుమార్ (40), విష్ణురాకూర్(42) మల్లారం శివారులోని ఓ క్రషర్‌లో కూలీలుగా పని చేస్తున్నారు. ఆదివారం రాత్రి వంట సామగ్రి కోసం ఇబ్రహీంనగర్‌కు బైక్‌పై వెళ్లి తిరిగి సిద్దిపేట వైపు నుంచి కరీంనగర్ మార్గంలో వస్తున్నారు. ఈ క్రమంలో మేడిపల్లి ఎక్స్ రోడ్డు సమీపంలోని మూల మలుపు వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో ఉలేష్‌కుమార్, విష్ణు రాకూర్‌లకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తపాస్‌పల్లి జలాలతో చేర్యాల ప్రాంత చెరువులు నింపాలి

● సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్

చేర్యాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలతో చేర్యాల ప్రాంతంలోని చెరువులు, కుంటలు నింపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ అన్నారు. చేర్యాల మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి ప్రారంభానికి ముందే పంటలు ఎండిపోతున్నాయని, గోదావరి జలాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నీటి పంపింగ్ చేపట్టినా ఇతర ప్రాంతానికి తరలించడానికి కారకులెవరని ప్రశ్నించారు. ఇటీవల పంపింగ్ నిలిపివేయడం సరికాదన్నారు. వెంటనే పంపింగ్ చేపట్టి రిజర్వాయర్‌ను నింపి చెరువులు, కుంటలకు నీళ్లు తరలించి పంటలను కాపాడాలన్నారు. లేనియెడల సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశంలో నాయకులు భూమయ్య, గూడెపు సుదర్శన్, సిద్దిరాం భద్రయ్య, గజ్జల సురేందర్, రఘు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'సాంస్కృతిక కార్యక్రమాలతో మానసిక ఒత్తిడి దూరం'



సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థులు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటే విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి దూరమవుతుందని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి సుభాష్, చైర్మన్ వడ్డేపల్లి బాలకృష్ణలు అన్నారు. శనివారం రాత్రి నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవంలో భాగంగా తల్లిదండ్రులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీజ, వినాయక రావు, గనీమ సింహ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం



రాయపోల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామంలో నెలకొల్పిన పెద్దమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు ముగిశాయి. ఆదివారం ఉదయం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పెద్దమ్మ పెద్దిరాజుల శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు.

మట్టి స్నానానికి మంచి స్పందన



సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట కోమటి చెరువు ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం వద్ద ఆదివారం మట్టి స్నాన(మడ్ బాత్) కార్యక్రమం నిర్వహించారు. వ్యాసమహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఇందులో దాదాపు 50 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యాసమహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మట్టి స్నానంతో శరీరంలోని అనేక రుగ్మతులు దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, యోగ శిక్షకుడు తోట సతీష్ వ్యాస మహర్షి యోగా సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చేర్యాల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్ 1992-93 విద్యాసంవత్సరం పదవతరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని అత్యంత ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబోధన చేసిన అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను, పాఠశాలతో నెలకొన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

కొండల్‌రెడ్డికి ఎంపీ పరామర్శ



గిరి మధరమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

ధూళిమిట్ట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్దూర్ మండల తాజా మాజీ జడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి మాతృమూర్తి గిరి మధరమ్మ దశదిన కర్మ కార్యక్రమం ఆదివారం వారి స్వగ్రామం జాలపల్లి గ్రామంలో జరిగింది. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాజలింగంగౌడ్, సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, తదితరులు హాజరై ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. గిరికొండల్ రెడ్డిని, కుటుంబ సభ్యులను ఎంపీ పరామర్శించారు. స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.